క్లుప్తంగా

వేమారెడ్డి కుటుంబానికి పరామర్శ



నాదెండ్ల: గత నెల 28న రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన దుగ్గెంపూడి వేమారెడ్డి కుటుంబ సభ్యులను బుధవారం నరసరావుపేట మాజీ ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాస రెడ్డి, గోల్కొండ గ్రూపు సంస్థల చైర్మన్ నడికట్టు రామిరెడ్డి పరామర్శించారు. చిరుమామిళ్ళ గ్రామానికి చెందిన వేమారెడ్డి కొంతకాలంగా నరసరావు పేటలో నివాసం ఉంటూ ప్రీకాస్ట్ అండ్ ఇన్‌ఫ్రా ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ నిర్వహిస్తున్నాడు. వ్యాపార పనుల మీద తూర్పుగోదావరి జిల్లా నల్లజర్ల మండలం దూబచర్ల జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన సంగతి విదితమే. వేమారెడ్డి చిత్రపటానికి నివాళులర్పించి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆయనతో పాటూ ప్రైవేటు ఇంజినీర్ల అసోసియేషన్ అధ్యక్షుడు కమలాకర్ రెడ్డి, వేమారెడ్డి, రమణా రెడ్డి ఉన్నారు.

హమ్మయ్య.. బెల్టు తీశారు!

సాక్షి ఎఫెక్ట్

నరసరావుపేట రూరల్: పెట్లూరివారిపాలెంలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని అరెస్ట్ చేసి ఆరు మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నట్టు రూరల్ సీఐ సోమయ్య తెలిపారు. గ్రామగ్రామన కూటమి బెల్ట్ శీర్షికను బుధవారం సాక్షిలో ప్రచురితమైన కథనానికి ఎక్సైజ్ అధికారులు స్పందించారు. మండలంలోని పలు గ్రామాల్లో బెల్ట్‌షాపులు నిర్వహిస్తున్నారన్న సమాచారంతో బుధవారం తనిఖీలు నిర్వహించారు. పెట్లూరివారిపాలెంలో బెల్ట్ షాపు నిర్వహిస్తున్న ఎం.గోపి అనే వ్యక్తిని అరెస్ట్ చేసి మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా సోమయ్య మాట్లాడుతూ బెల్ట్ షాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అక్రమ మద్యం విక్రయాలపై నిరంతరం దాడులు కొనసాగిస్తామని తెలిపారు. గ్రామాల్లో బెల్ట్‌షాపుల సమాచారం తెలియజేస్తే చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ఏకాగ్రత, సమయస్ఫూర్తితో ఉన్నత శిఖరాలు



నరసనసరావుపేట రూరల్: ఏకాగ్రత, సమయస్ఫూర్తితో వ్యవహరించడం ద్వారా విద్యార్థులు ఉన్నత శిఖరాలు చేరుకోవచ్చని ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం యూత్ ట్రైనర్ డాక్టర్ కాళహస్తి నల్లిబొయిన తెలిపారు. కేసానుపల్లి ఎంఏఎం గ్రూప్ కళాశాలలో బుధవారం యంగ్ మైండ్స్ డ్రీమ్ ఇట్-డూ-ఇట్ అనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ కాళహస్తి మాట్లాడుతూ యువత సెల్‌ఫోన్లకు దూరంగా ఉండాలని తెలిపారు. సమాజంలో వస్తున్న మార్పులను గమనిస్తూ విజయానికి బాటలు వేసుకోవాలని సూచించారు. మనిషి జీవితంలో ఉన్నతస్థాయికి ఎదగాలంటే తనకంటూ ప్రత్యేకతను ఏర్పరుచుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ మేదరమెట్ల రామశేషగిరిరావు, డైరెక్టర్ దరువూరి శ్రావ్య, వర్సిటీ మాజీ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ భవనం ఆంజనేయరెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అవినీతి రహిత సమాజాన్ని నిర్మిద్దాం



నరసరావుపేట ఈస్ట్: అవినీతి రహిత సమాజ నిర్మాణంలో యువత కీలకపాత్ర పోషించాలని వక్తలు తెలిపారు. చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంక్ నరసరావుపేట శాఖ ఆధ్వర్యంలో బుధవారం కృష్ణవేణి డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపల్ నాతాని వెంకటేశ్వర్లు అధ్యక్షతన విజిలెన్స్ అవేర్నెస్ ప్రోగ్రామ్ నిర్వహించారు. కేంద్ర విజిలెన్స్ కమిషన్ ఆధ్వర్యంలో ప్రతి ఏడాది ఆగస్టు 16 నుంచి నవంబర్ 15వ తేదీ వరకు దేశవ్యాప్తంగా విజిలెన్స్ అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు వివరించారు. విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించి బహుమతులు అందచేశారు. కార్యక్రమంలో బ్యాంక్ రీజనల్ మేనేజర్ పి.శ్రీనివాస్, విజిలెన్స్ ఆఫీసర్ రాంబాబు, కళాశాల డైరెక్టర్ కోమటినేని నాసరయ్య, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రామనామ ఏకాహం ప్రారంభం

రొంపిచర్ల: మండలంలోని వి.రెడ్డిపాలెం గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ సీతారామాంజనేయ స్వామి ఆలయంలో బుధవారం కార్తిక మాస రామనామ సంకీర్తన ఏకాహం కార్యక్రమం ప్రారంభం అయ్యింది. ప్రతి ఏటా కార్తిక నాగ పంచమి రోజు రామనామ ఏకాహం చేయటం ఈ దేవాలయంలో ఆనవాయితీ. కంకణ దారులైన భక్తులు హరేరామ హరేరామ రామరామ హరేహరే, హరేకృష్ణ హరేకృష్ణ కృష్ణకృష్ణ హరేహరే నామాన్ని 24 గంటల పాటు స్మరిస్తూ భజనలు చేస్తారు. దేవాలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు. పూజలను ఆలయ అర్చకులు నారాయణం వెంకట రామకృష్ణమాచార్యులు నిర్వహించారు.

రామలింగేశ్వరా! కొండ ఎక్కలేమయ్యా!?

- ప్రమాదభరితంగా విను 'కొండ మార్గం'
- భారీ వర్షాలకు కొట్టుకుపోయిన మట్టి



పగుళ్లిచ్చిన రహదారి



కొట్టుకుపోయిన ఘాట్‌రోడ్డు

వినుకొండ(నూజెండ్ల): వినుకొండ కొండపైన రామలింగేశ్వర స్వామి ఘాట్‌రోడ్డు పూర్తిగా పాడైపోయి ప్రమాద భరితంగా మారింది. ఇటీవల కురిసిన వర్షాలకు కొండపై నుంచి నీరు ప్రవహించడంతో పాటు భారీ వర్షాలకు రోడ్డు కోతలకు గురై కొండ పైన రాళ్ల రోడ్డుపై పడటంతో కనీసం ద్విచక్ర వాహనం వెళ్లేందుకు కూడా వీలులేకుండా పాడైంది. గతంలో తొలి ఏకాదశి పర్వదినం కార్తిక మాసం వంటి పర్వదినాల్లో ఆర్టీసీ బస్సులు కూడా పైకి నడిచాయి. ప్రస్తుతం కార్తిక మాసం కొండపైకి వెళ్లాలంటే మెట్ల మార్గం పూర్తిగా మూసుకు పోయింది. ఘాట్ రోడ్డు వెంట పైకి వెళ్లాలంటే భక్తులు ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితి ఏర్పడింది.

గతంలో ఇదే ఘాట్ రోడ్ నిర్మాణానికి సుమారు రూ.9 కోట్ల రూపాయలు ఖర్చు చేసి కొండపైకి బస్సులు నడిచే విధంగా రోడ్డు ఏర్పాటు చేశారు. కొండపైన నూతన దేవాలయం నిర్మాణ పనులు కూడా మధ్యలో ఆగిపోయాయి. బాలాలయాల్లో ఉన్న దేవత విగ్రహాలకు పూజలు చేసుకునేందుకు భక్తులు వెళ్లేందుకు వీలులేకుండా భక్తులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కార్తికమాసం సోమవారం దర్శించుకునేందుకు భక్తులు కొండ మార్గం వరకు వెళ్లి బైక్ ఎక్కలేక తిరిగి వెళుతున్నారు. ఇప్పటికైనా అధికారులు దేవాలయ కమిటీ సభ్యులు స్పందించి ఘాట్ రోడ్ నిర్మాణాన్ని గుంతలను పూడ్చివేసి కొండపైకి వెళ్లేలా ఏర్పాట్లు చేయాలని కోరుతున్నారు.

మరమ్మతులు చేస్తే బాగుంటుంది



వినుకొండ రామలింగేశ్వరస్వామి కొండపైకి వెళ్లేందుకు ఘాట్‌రోడ్డు పూర్తిగా పాడైంది. దీంతో స్వామివారిని దర్శించుకునేందుకు వీలు లేకుండా పోయింది. ఇప్పటికైనా అధికారులు ఆలయ కమిటీ నిర్వాహకులు ఘాట్‌రోడ్డుకు మరమ్మతులు చేస్తే బాగుంటుంది.

–బద్దిగం వెంకట నరసింహారావు, వినుకొండ

సంఘ సేవకుడికి ఘన సత్కారం

- ఝున్ను మాస్టార్‌కు గౌరవ డాక్టరేట్
- చేతిరాత శిక్షణ నైపుణ్యాలు అందించినందుకు గుర్తింపు



పలు రంగాల్లో డాక్టరేట్ అందుకున్న వివిధ రాష్ట్రాలకు చెందిన సంఘ సేవకులు

యడ్లపాడు: సేవా, నైపుణ్యాలలో అత్యుత్తమ సేవలను అందించిన ఉపాధ్యాయుడికి కాశ్మీర్‌కు చెందిన ఓ స్వచ్ఛంద సంస్థ గౌరవ డాక్టరేట్‌ను అందించి సత్కరించింది. పల్నాడు జిల్లా యడ్లపాడు మండలం సొలస ఏపీ మండల ప్రాథమిక పాఠశాలలో సెకండ్ గ్రేడ్ స్కూల్ అసిస్టెంట్ షేక్ ఝున్నుసాహెబ్‌కు ఈ అరుదైన గౌరవ దక్కడం పట్ల పలువురు ప్రముఖులు అభినందిస్తున్నారు. గత రెండున్నర దశాబ్దాలుగా ఉపాధ్యాయుడిగా అంకిత భావంతో విధులు నిర్వహిస్తూ, చేతిరాతలో ఉన్న తన నైపుణ్యాలను ఐదేళ్లుగా పలువురికి ఉచితంగా తర్ఫీదు ఇస్తున్నారు. అంతేకాకుండా కోవిడ్ విపత్తు సమయంలో అనేక సేవా కార్యక్రమాలను స్వచ్ఛందంగా నిర్వహించారు.

ఇప్పటికే 18వేల మంది విద్యార్థులకు, 700 మంది ఉపాధ్యాయులకు చేతిరాతలో ఉచిత శిక్షణ ఇచ్చారు. ఈ నేపథ్యంలో ఆయన సేవల్ని గుర్తించిన కాశ్మీర్‌కు చెందిన గ్లోబల్ హ్యూమన్‌రైట్స్ ట్రస్ట్ (జీహెచ్‌ఆర్టీ) ఝున్నుసాహెబ్‌కు విద్యా విభాగంలో ఈ డాక్టరేట్‌తో సత్కరించింది. జీహెచ్‌ఆర్టీ ప్రతి ఏటా దేశంలోని వివిధ రాష్ట్రాల్లో ఇంటర్నేషనల్ పీస్ కాన్ఫరెన్స్‌ను ఏర్పాటు చేస్తుంది. 2024 సంవత్సరానికి తెలంగాణ రాష్ట్రం ఇందుకు వేదికైంది. హైదరాబాద్‌లోని తెలంగాణ సారస్వత పరిషత్ ప్రాంగణంలో ఈనెల 4వ తేదీన జరిగిన కాన్ఫరెన్స్‌లో దేశంలోని 10 రాష్ట్రాలలో వివిధ రంగాల్లో విశిష్ట సేవలు అందించిన వారిని గుర్తించి 50 మందికి డాక్టరేట్‌ను ప్రదానం చేసింది. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా శ్రీలంక పార్లమెంట్ యూత్ ఎక్స్‌ట్రనైల్ ఎఫైర్ డిప్యూటీ మినిస్టర్ అహమ్మద్ సాధిఖ్, శ్రీలంక ఫైనాన్స్ మినిస్ట్రీ ఎగ్జిక్యూటివ్ మెంబర్ ముఖ్తీమొయిన్, భారత టెలీ కమ్యూనికేషన్ ఇండియా మినిస్ట్రీమెంబర్ డాక్టర్ సాంకేత్ సంపత్ ఖుర్‌పుడే, హెచ్‌ఆర్ సంస్థ చైర్మన్ రెహమాన్ హాజరై గౌరవ డాక్టరేట్‌లను అందించి అభినందించారు.

టీటీడీ పాలక మండలిలో గిరిజనులకు స్థానం కల్పించాలి

ఏపీ గిరిజన సంఘాల ఐక్యవేదిక అధ్యక్షుడు బి.శ్రీనునాయక్



మాట్లాడుతున్న శ్రీనునాయక్

చిలకలూరిపేట: టీటీడీ పాలక మండలిలో కూటమి ప్రభుత్వం గిరిజనులకు స్థానం కల్పించకపోవడం సరికాదని ఏపీ గిరిజన సంఘాల ఐక్యవేదిక అధ్యక్షుడు బి.శ్రీనునాయక్ విమర్శించారు. పట్టణంలోని సంఘ కార్యాలయంలో బుధవారం ఆయన మాట్లాడుతూ హాతిరామ్‌బాబాజీ భక్తులుగా ఖ్యాతి గడించిన గిరిజనులకు పాలక మండలిలో చోటు కల్పించటంలో కూటమి ప్రభుత్వం విఫలమైందని ఆందోళన వ్యక్తం చేశారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో టీటీడీ బోర్డులో గిరిజనులకు అవకాశం కల్పించారని గుర్తు చేశారు. రూల్ ఆఫ్ రిజర్వేషన్ అమలు చేసి గిరిజనులకు స్థానం కల్పించాలని లేని పక్షంలో ఆందోళన కార్యక్రమాలు చేపట్టడంతో పాటు న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తామని హెచ్చరించారు.

పట్టభద్రుల ఓటు నమోదుకు 1385 దరఖాస్తులు

నాదెండ్ల: ఉమ్మడి గుంటూరు-కృష్ణా జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గ శాసన మండలి ఎన్నికకు సంబంధించి నాదెండ్ల మండల పరిధిలో 1385 ఓట్లు బుధవారం సాయంత్రం 5 గంటల సమయానికి నమోదైనట్లు తహసీల్దార్ ఏవీ రమణ చెప్పారు. ఆన్‌లైన్ ద్వారా 1136, ఆఫ్‌లైన్ ద్వారా 249 దరఖాస్తులు అందాయన్నారు.

శావల్యాపురంలో...

శావల్యాపురం: త్వరలో జరగనున్న ఎమ్మెల్సీ (పట్టభద్రుల) ఎన్నికల నేపథ్యంలో మండలంలోని 15 గ్రామపంచాయతీనుంచి ఇప్పటి వరకు 607 దరఖాస్తులు అందినట్లు తహసీల్దారు కె.సుజాత బుధవారం తెలిపారు. ఈసందర్భంగా తహసీల్దారు మాట్లాడుతూ దరఖాస్తులన్నీ ఆయా గ్రామాలకు చెందిన వీఆర్వోలు క్షేత్రస్థాయిలో విచారణ చేసిన అనంతరం తుది జాబితా ప్రకటిస్తామన్నారు.

అక్రమ మద్యం విక్రేత అరెస్ట్

వినుకొండ (నూజెండ్ల): అనధికారికంగా మద్యం వి క్రయిస్తున్న వ్యక్తిని అరెస్ట్ చేసిన సంఘటన బుధ వా రం జరిగింది. వినుకొండ ప్రొహిబిషన్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని వినుకొండ మండలంలో గల పెరుమాళ్లపల్లి గ్రామానికి చెందిన కొత్తమాసు రాము అనే వ్యక్తి అనధికారికంగా మద్యం విక్రయిస్తుండగా అదుపులోకి తీసుకొని అతని వద్ద ఉన్న 12 మద్యం బాటిళ్ల (180 పరిమాణం)ను స్వాధీనం చేసుకొని అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపినట్లు సీఐ శ్రీనివాసరావు తెలిపారు.

వరిలో తెగుళ్లు నివారించండి

శావల్యాపురంః మండలంలోని బొందిలిపాలెం ,మతుకుమల్లి గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం వ్యవసాయ అధికారులు బుధవారం నిర్వహించారు. ఈసందర్భంగా మండల వ్యవసాయ అధికారి రామినేని రామారావు మాట్లాడుతూ వరి పైరులో వాతావరణంలో మార్పులు సంభవించటం వలన ఆకుచుట్టూ పురుగు, అగ్గితెగులు తదితర తెగుళ్ల సోకినట్లు గుర్తించినట్లు తెలిపారు. వ్యవసాయ అధికారుల సూచనలు మేరకు ఆకు చుట్టూ పురుగు నివారణకు ప్రొఫెనోఫాస్ 2.5 మీల్లీ గ్రాముల నీటిలో అగ్గితెగులుకి ట్రై సైక్లోజోల్ 120 గ్రాముల ఎకరానికి, ఆకుమచ్చ తెగులకు కాపర్ హైడ్రాక్సైడ్ 500 గ్రాములు ఎకరానికి పిచికారి చేయాలన్నారు. తెగులు సోకిన సత్వరమే సస్యరక్షణ చర్యలు చేపట్టకపోతే ఆశించిన స్థాయిలో దిగుబడులు తగ్గిపోతాయన్నారు. ఎరువులు వినియోగం యాజమాన్యం పద్ధతులు గురించి వివరించారు. ఈకార్యక్రమంలో ఏఈవో పురేటి అశోక, వీఏఏ వరలక్ష్మి, లక్ష్మీదుర్గా, రైతులు పాల్గొన్నారు.

ఎలాగయ్యా! కుటుంబాలు గడిచేదీ?

- మూడు నెలలుగా వేతనాలు ఇవ్వడం లేదు!
- కుటుంబాలు పస్తులు ఉంటున్నాయి
- అధికారులకు 104 ఉద్యోగుల వినతి



నోడల్ అధికారి డాక్టర్ హనుమకుమార్‌కు వినతి పత్రం అందజేస్తున్న 104 ఉద్యోగులు

నరసరావుపేటటౌన్: మూడు నెలలుగా వేతనాలు అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం.. చాలీచాలని జీతాలతో కుటుంబ పోషణ భారంగా మారింది.. సమస్య పరిష్కరించాలని 104 ఉద్యోగులు జిల్లా వైద్యాధికారి డాక్టర్ రవికుమార్, నోడల్ అధికారి డాక్టర్ హనుమకుమార్‌లను బుధవారం కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘ ప్రతినిధులు దుంప కోటిరెడ్డి, మల్లిఖార్జునరావులు మాట్లాడుతూ గత మూడు నెలలుగా జీతాలు అందటం లేదని ఉద్యోగులు వాపోయారు. 104 సేవలను ప్రభుత్వమే ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ద్వారా నిర్వహించాలని కోరారు. 2020 తర్వాత విధుల్లో చేరిన డ్రైవర్‌లు, డీఈఓలకు జీవో నెం.7 ద్వారా వేతనాలు ఇవ్వాలని కోరారు. అక్రమంగా వసూలు చేసిన పీఎఫ్‌ను తిరిగి చెల్లించి 74 మంది సీనియర్ డ్రైవర్‌లకు స్లాబ్ అమలు చేయాలని కోరారు. ఉద్యోగులకు యాజమాన్యం నుంచి రావాల్సిన బకాయిలను ప్రభుత్వం సత్వరమే మంజూరు చేయాలని డిమాండ్ చేశారు.

జీస్టాంప్ కంపెనీలో తిరుమల విద్యార్థులకు ఉద్యోగాలు



ఉద్యోగాలు సాధించిన విద్యార్థులతో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వైవీ నారాయణ

నరసరావుపేట రూరల్: చెన్నైకి చెందిన జీ స్టాంప్ కంపెనీ నిర్వహించిన ప్రాంగణ ఎంపికలో 28 మంది విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికైనట్టు తిరుమల ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వైవీ నారాయణ తెలిపారు. కళాశాలలో బుధవారం కంపెనీ నిర్వహించిన ప్రాంగణ ఎంపికలకు ఈసీఈ, ఈఈఈ విభాగాలకు చెందిన 210 మంది విద్యార్థులు హాజరైనట్టు తెలిపారు. వ్రాత పరీక్షలో 58 మంది ఉత్తీర్ణులు కాగా, పర్సనల్ ఇంటర్వ్యూలో 28 మంది ఉద్యోగాలకు సాధించినట్టు వివరించారు. ఎంపికైన వారిలో ఈసీఈ విభాగం-14 మంది, ఈఈఈ విభాగం-14 మంది ఉన్నారని తెలిపారు. వీరికి వార్షిక వేతనం రూ.2.52 లక్షలు చెల్లిస్తారని తెలిపారు. ఉద్యోగాలు సాధించిన విద్యార్థులను కళాశాల చైర్మన్ బొల్లా బ్రహ్మనాయుడు, కార్యదర్శి రావెల సత్యనారాయణ, ప్రిన్సిపల్ వైవీ నారాయణ, ప్లేస్‌మెంట్ అధికారి ఎం.సాంబశివరావు, అధ్యాపకులు అభినందించారు.

వచ్చేనెలలో జిల్లాస్థాయి సాంస్కృతిక పోటీలు

నియోజక వర్గ బాల ఉత్సవ కన్వీనర్ బెజవాడ నాగేశ్వరరావు



గోడపత్రికలు ఆవిష్కరిస్తున్న ఉపాధ్యాయులు

శావల్యాపురం: పల్నాడు జిల్లాస్థాయిలో డిసెంబరు 13,14 తేదీల్లో జరగనున్న జిల్లాస్థాయి అంతర్ పాఠశాలల సాంస్కృతిక పోటీలను విజయవంతం చేయాలని నియోజకరవర్గ బాల ఉత్సవ కన్వీనర్ బెజవాడ నాగేశ్వరరావు అన్నారు. బుధవారం మండలంలోని మతుకుమల్లి, కారుమంచి, శావల్యాపురం గ్రామాల్లోని జెడ్పీ ఉన్నత పాఠశాలల్లో గోడ పత్రికలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థుల్లో సృజనాత్మకత, నైతిక విలువలు, పోటీతత్వం నాయకత్వ లక్షణాలు తదితరవన్నీ పెంపొందించడానికి ఎంతో దోహద పడతాయన్నారు. గత ఏడాది జిల్లా నలు మూలల నుంచి రెండు రోజుల పాటు నిర్వహించిన బాల ఉత్సవాలకు 15 వేల విద్యార్థులకు 64 ఈవెంట్స్‌లో పాల్గొన్నట్లు నిర్వాహకులు కట్టా కోటేశ్వరరావు, ఆక్స్‌ఫర్డ్ స్కూలు డైరెక్టరు రాజారెడ్డి తెలిపారు. ఈ ఏడాదిలో జరగనున్న బాల ఉత్సవాలకు 20 వేల మంది బాల బాలికలు పాల్గొంటారన్నారు. ఎంట్రీ ఫీజు లేదని, పోటీల్లో పాల్గొనే వారందరికీ రెండు రోజుల ఉచిత భోజనం కూడా ఏర్పాటు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో కమిటీ ప్రతినిధి వెంకట్, కుమ్మరి శ్రీనివాసరాజు, అబ్దుల్లా, గరికపాటి రవి, టి.నిర్మల కుమారి, హబీ పాల్గొన్నారు.

కుక్క కాటుతో మహిళకు గాయాలు

నెలరోజుల్లో 20 మందిని కరిచిన వీధి కుక్క



గణపవరంలో కుక్కకాటుకు గురైన మహిళ

నాదెండ్ల: గ్రామాల్లో వీధి కుక్కల బెడద రోజురోజుకు పెరుగుతోంది. తాజాగా గణపవరంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఎదురుగా ఉన్న సచివాలయం వద్ద ద్విచక్ర వాహనంపై వెళ్తున్న మహిళపై వీధి కుక్క దాడి చేసి కరిచింది. దీంతో ఆమె కాలికి తీవ్ర గాయమైంది. ఉదయం 9 గంటల సమీపంలో తన కుమారుడు యాసిన్ టీవీఎస్ ఎక్సెల్ మోపెడ్‌పై వెళ్తుండగా వెనుక నుండి వెంబడించిన కుక్క ఆమెను కరిచి గాయపరిచింది. దీంతో ఆమెను సమీపంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో చికిత్స చేయించారు. గడిచిన నెల రోజుల వ్యవధిలో సుమారు 20 మందికి పైగా కుక్కకాటుకు గురయ్యారు. అధికారులు కుక్కలను పట్టుకుని సుదూర ప్రాంతాల్లో విడిచిపెట్టాలని స్థానికులు కోరుతున్నారు. ఇప్పటికే వీధికుక్కల దాడిలో పది లేగదూడలు, గొర్రెలు మృతి చెందాయని వారంటున్నారు. దీనిపై పంచాయతీ కార్యదర్శి మారుతి బాబుని వివరణ కోరగా గృహాల్లో పెంచుకునే కుక్కల బాధ్యత యజమానులే వహించాలన్నారు. వీధి కుక్కల నివారణకు చర్యలు తీసుకుంటామన్నారు.

పల్లెపండుగ పనులు పారదర్శకంగా నిర్వహించాలి

జిల్లా ఉపాధి పథకం పీడీ మతం సిద్ధాలింగమూర్తి



ఇర్లపాడులో సీసీ రోడ్డు పనుల నాణ్యతను పరిశీలిస్తున్న పీడీ సిద్ధాలింగమూర్తి

శావల్యాపురం: మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి పథకంలో భాగంగా పల్లెపండుగ కార్యక్రమంలో చేపట్టిన అభివృద్ధి పనులు పారదర్శకంగా చేయాలని జిల్లా డ్వామా పీడీ మతం సిద్ధాలింగమూర్తి అన్నారు. బుధవారం మండలంలోని ఇర్లపాడు గ్రామంలో చేపట్టిన అభివృద్ధి పనులను ఉపాధి అధికారులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఉపాధి పీడీ సిద్ధాలింగమూర్తి మాట్లాడుతూ జిల్లాలో గోకులం షెడ్లు 706, సీసీ రోడ్డు, డ్రెయిన్స్ పనులు 618 మంజూరు కాగా ఉపాధి నిధులు రూ.70 కోట్ల 84 లక్షల నిధులను ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. ఇప్పటి వరకు జిల్లాలో సీసీ రోడ్లు పనులు 134 గోకులం షెడ్లు 96 పూర్తయినట్లు తెలిపారు. పల్లె పండుగ కార్యక్రమంలో మంజూరైన పనులన్నీ ఈ నెలఖారులోగా ప్రారంభించాలన్నారు. అలాగే పనులన్నీ సంక్రాంతి లోగా నూరు శాతం పూర్తి చేయాలన్నారు. పనులన్నీ నాణ్యత ప్రమాణాలు పాటించేలా క్షేత్రస్థాయిలో అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేయాలన్నారు. ఉపాధి అధికారులు సిబ్బంది జాబ్ కార్డులు ఉన్నవారందరికీ పనులు కల్పించాలన్నారు. అనంతరం గ్రామంలో అంగన్‌వాడీ సెంటరు సందర్శించి సెంటరు నిర్వాహణ పనితీరు తదితరవన్నీ పరిశీలించారు. ఆయనతో పాటు ఏపీడీ బూసిరెడ్డి, ఏపీవో కె.రామారావు, పంచాయతీరాజ్ ఏఈ వెంకటేశ్వర స్వామి ఉన్నారు.

కొనసాగుతున్న స్విమ్మింగ్ పోటీలు



విజేతలకు బహుమతులు అందిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ అరవిందబాబు

నరసరావుపేట ఈస్ట్: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో శ్రీసుబ్బరాయ అండ్ నారాయణ కళాశాల స్విమ్మింగ్ పూల్‌లో రాష్ట్రస్థాయి 68వ స్కూల్ గేమ్స్ స్విమ్మింగ్ పోటీలు ఉత్సాహంగా కొనసాగుతున్నాయి. తొలిరోజు విజేతలకు బుధవారం ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు బహుమతులు అందచేశారు. స్విమ్మింగ్‌లో అండర్-14, అండర్-17, అండర్-19 విభాగాలలో విద్యార్థులు పోటీ పడ్డారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఒత్తిడిని జయించేందుకు క్రీడలు దోహదపడతాయని తెలిపారు. విద్యార్థులు క్రీడా స్ఫూర్తిని అలవరుచుకోవటం ద్వారా జీవితంలో ఉన్నతంగా ఎదగవచ్చని వివరించారు. ఓటమిని విజయానికి మార్గంగా మలచుకోవాలని హితవు పలికారు. ప్రతి విద్యార్థి ఏదో ఒక క్రీడలో ప్రవేశం కలిగి ఉండాలని తెలిపారు. కార్యక్రమంలో స్కూల్ గేమ్స్ పల్నాడుజిల్లా కార్యదర్శి ఎస్.సురేష్‌కుమార్, పోటీల పరిశీలకుడు బంగార్రాజు. స్విమ్మింగ్ కోచ్ జి.సురేష్, కళాశాల పాలకవర్గ అధ్యక్షుడు కపలవాయి విజయకుమార్, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పాఠశాలకు రాని విద్యార్థులపై దృష్టి పెట్టాలి

- డీఈవో ఎల్ .చంద్రకళ
- కావూరు జెడ్పీ హైస్కూల్‌లో తనిఖీలు



తల్లిదండ్రులకు వివరిస్తున్న చంద్రకళ

చిలకలూరిపేటటౌన్: పాఠశాలకు హాజరు కాని విద్యార్థులపై ప్రత్యేక దృష్టిని సారించాలని పల్నాడు జిల్లా విద్యాశాఖ అధికారి ఎల్ చంద్రకళ తెలిపారు. మండలంలోని కావూరు జిల్లా పరిషత్ హైస్కూల్‌ను బుధవారం ఆమె ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా పీఎంశ్రీ నిధులతో చేపట్టిన కెమిస్ట్రీ ల్యాబ్ నిర్మాణ పనుల్ని, పాఠశాల క్రీడా ఆధునీకరణ పనుల్ని పరిశీలించారు. అనంతరం పాఠశాల మౌలిక వసతులను హెచ్ఎం శ్రీనివాసరావుతో కలిసి చూశారు. బాలుర మరుగుదొడ్లు మరమ్మతు నిర్వహించాలని, అలాగే వివిధ కారణాలతో పాఠశాలకు హాజరు కాని విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. వారి గృహాలను సందర్శించి తల్లిదండ్రులను కలిసి పనులకు వెళ్లకుండా చూడాలని చెప్పారు. స్థానికంగా ఉన్న నూలుమిల్లును సందర్శించి బాలకార్మికులను పనిలోకి చేర్చుకోవద్దని యాజమాన్యానికి సూచించారు. అలాగే పాఠశాలకు రాని విద్యార్థుల ఇళ్లకు వెళ్లి తల్లిదండ్రులతో కారణాలను తెలుసుకున్నారు. 14 ఏళ్ల వరకు పిల్లలను విధిగా పాఠశాలలకు పంపించేలా తల్లిదండ్రులు బాధ్యతగా వ్యవహరించాలని అవగాహన కల్పించారు.

యూనియన్ బ్యాంకులో విజిలెన్స్ వారోత్సవాలు



కార్యక్రమంలో పాల్గొన్న డాక్టర్ జగన్ మోహన్ రెడ్డి, మాధురి, మాక్సివిజన్ సిబ్బంది

నరసరావుపేట: స్థానిక రెడ్డినగర్‌లోని యూనియన్ బ్యాంకు ఆఫ్ ఇండియా ప్రాంతీయ కార్యాలయంలో సెంట్రల్ విజిలెన్స్ కమిషన్ ఆదేశాలను అనుసరించి రీజినల్ హెడ్ మాధురి అధ్యక్షతన విజిలెన్స్ అవగాహన వారోత్సవాలు మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా బ్యాంకు సిబ్బంది, ఖాతాదారులకు కంటి పరీక్షలు, ఆరోగ్య పరీక్షలు చేసిన అనంతరం రక్తదాన శిబిరం నిర్వహించారు. పలువురు బ్యాంకు ఉద్యోగులు రక్తదానం చేశారు. మణిపాల్ సిగ్నా క్లస్టర్ హెడ్ మరియదాసు సౌజన్యంతో మాక్సివిజన్ సూపర్ స్పెషాల్టీ ఐ హాస్పిటల్ డాక్టర్ రామలింగారెడ్డి, రెడ్ క్రాస్ జిల్లా అధ్యక్షులు డాక్టర్ కంజుల జగన్‌మోహన్ రెడ్డి, వైద్య సిబ్బంది, బ్యాంకు సిబ్బంది సహాయ సహకారాలు అందజేశారు.

నేటి నుంచి పత్తి కొనుగోళ్లు ప్రారంభం

యడ్లపాడు: సీసీఐ పత్తికొనుగోలు కేంద్రాన్ని నియోజకవర్గంలో గురువారం ప్రారంభిస్తున్నట్లు చిలకలూరిపేట వ్యవసాయ మార్కెట్ యార్డు కార్యదర్శి యయోగేశ్వరరావు తెలిపారు. యడ్లపాడు మండలం తిమ్మాపురం జాతీయ రహదారి పక్కనే ఉన్న ఉమామహేశ్వరరావు కాటన్ మిల్ నందు సీసీఐ కొనుగోల కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. సీసీఐ కేంద్రాన్ని నియోజకవర్గ ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఉదయం 10.30 గంటలకు కార్యక్రమానికి సీసీఐ బయ్యర్ రమేష్ బాబు, మార్కెట్‌యార్డ్ తదితర శాఖల అధికారులు హాజరు అవుతారన్నారు.

అలా తేవద్దు..

సీసీఐ కేంద్రానికి పత్తి తీసుకువచ్చే రైతులు విధిగా ప్లాస్టిక్ గోతాల్లో తీసుకురావద్దని చెప్పారు. గోనె సంచుల్లో తీసుకురావాలన్నారు. లూజు పత్తి తీసుకువచ్చే వారికి ప్రాధాన్యత నిస్తామన్నారు. తేమశాతం అధికంగా లేకుండా పత్తిని పూర్తిగా ఆరబెట్టుకుని కేంద్రానికి తేవాలన్నారు. 8 శాతం తేమ ఉన్న పత్తికి రూ.7,521 ధర చెల్లించనున్నట్లు తెలిపారు. అంతకు మించి తేమ శాతం పెరిగే కొద్ది ధర తగ్గుదల ఉంటుందన్నారు. కేంద్రానికి పత్తి తీసుకువచ్చే ముందుగా రైతులు తమ సమీప ఆర్‌బీకేల్లో ఈ క్రాప్ నమోదు, ఈకేవైసీతో పాటు తమ పేర్లను రిజిస్టర్ చేయించుకుని రావాలన్నారు.